# రిక్షాలో నెక్లేస్

యస్. కె. రాజేశ్వరీ రాణి

ఈ దెబ్బతో తాను డిటెక్టివ్‌గా పరిచయ మయిపోతాడు అందరికీ. ఆ విషయం తల్చుకొంటేనే, రాముకు వళ్ళుజలదరించింది. అత్తాయి కూడా "అన్ని డిటెక్టివ్ పుస్తకాలు చదువుతావుకదురా" ఆ నెక్లెస్ ఎట్లాపోయిందో కనిపెట్టు. నీపేరు వాడ వాడలా చాటుతా చూసుకోమన్నది, రామం ఎగిరి గంతేశాడు.

తనడైరీ అనబడే పుస్తకంలో చాలా రాసుకొన్నాడు "నిన్న...అనగా 12–9–56 పగలు పట్టపగలు పన్నెండింటికి రెండు గంటల మధ్య శ్రీమతి హనుమంతమ్మాయిగారి నెక్లెస్ సుమారు 5 వందలు చేయునది అపహరింప బడినది."

రామం ఏదో మర్చిపోయి తల గోక్కున్నాడు.. ఛ! తనకో అసిస్టెంటు ఉండవలసింది:.. ఊఁ.. కానీ.. ఆఁ.. జ్ఞప్తికొచ్చింది. హనుమంతమ్మాయిగారి అమ్మాయి ఉషా.: ఆమె స్నేహితురాలు ఉమ కలిసి మేటనీకి వెళ్ళారుట: సినీమాలో పోలేదని ఉమ ఎందుకంత గ్యారంటీగా చెప్తుతుంది! అదీ ఒక ప్రశ్న! కాని., ఉష.. నెక్లెస్ యజమాని ఉష, తను మేటనీకి వెళ్ళేముందు తన మెడలో చూసుకున్నానని.. ఆ తర్వాత పోయిన విషయం తనకు అమ్మ అడిగేంతవరకూ తెలియదని చెప్పింది: ఉమని మరీ 'ఇది' గా ప్రశ్నలు అడగవద్దంది ఆ పిల్ల జిల్లాజడ్జిగారి కూతురుట! ఆపిల్లకు రవ్వలనెక్లెస్ 3 వేల రూపాయీలది వుందని చెప్పింది ఉష.

ఉమ సంగతి తేల్చుకొన్నాడు. మధ్యాహ్నానికి రామం అష్టకష్టాల మీద. ఉమ జిల్లాజెడ్జి రెండో అమ్మాయి. ఇంటరు చదువుతోంది. ఉషకి ప్రాణ స్నేహితురాలు. 5 వేల రూ॥రవ్వల నెక్లెస్ వుంది. కానీ అది ప్రస్తుతం ఉమ అక్కగారు బి. ఎ. చదువుతున్న రమాదేవి మెళ్ళో వుంది. ఉమ చాలా మంచిదే. కాలేజీలోకంతా మంచి పేరేవుంది, కాబట్టి ఉమని అలావుంచాను. ఇంట్లోనే దండగ పిండం తింటూ బి. యస్. సి. పూర్తిచేసుకోవాలని చూస్తున్న రవిపై వాలింది రామం చూపు.

వాడు బీదవాడే అయినా వకీలు మామయ్యే వాణ్ణి ఎందుకో వకందుకు చదివిస్తున్నాడు. కారణం సువిదితమే. ఉషకు కాకపోయినా సుగుణ. కమల. రాధ.. ముగ్గురున్నారు అమ్మాయిలు. అంతా అందమైన వారే! వాళ్ళ ముగ్గుర్ని అడిగారు ప్రశ్నలు. "ఉమ మెళ్ళో నెక్లెస్ చూశారా!" అంటూ. రాధ మాత్రం "మహామా లావు డిటెక్టివ్ దాపురించావయ్యా ఫో... ఫో... అవన్నీ గమనించేందుకు నేనేం సి. ఐ. డి. నా" అని పెంకిజవాబిచ్చింది. తర్వాత "అది ఇంటికి రాగానే నేరుగా బాతురూముకెళ్ళింది. ఎందుకో కనుక్కో" అంటూ తనే డిటెక్టివ్‌లా "నువు ఇంటికి రాగానే ఉషక్కాయ్‌తో మాట్లాడావే అక్కాయ్ మెడలో నెక్లెస్‌ని నువు చూశావా?" అని అడిగింది. దీని తస్సదియ్యా: అవును. అప్పుడు ఉషని పరీక్షగా చూసేందుకు కారణం కనపడలేదు. గంటకొక డ్రెస్ మార్చే పిల్లను ఎలా గుర్తుపట్టవీలవుతుంది. మరీని ఈ ఆడపిల్లలు. కాలేజీ గట్టెక్కాక మరీ మితిమీరిపోతారు. ఆకారులూ. వికారులూ.. ఇద్దరూ!!

ఆ తర్వాత ఉషని నాయనమ్మ చూసిందట. ఆమె ఉష ఏంబట్టలేసుకొందో" అదంతా వర్ణించి అసలు విషయం నెక్లెస్‌ని "ఆ పిల్ల మెడలో ఉన్నట్టేవుంది" అని సందేహంతో చెప్పివేసింది.

రామం బుఱ్ఱ గోక్కున్నాడు. ఎలాపోయింది నెక్లెస్:

దాసీది ఈ వ్యవహారంలో చిక్కుకోలేదు. రామం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. కానీ.. ఓసంగతి రామం మెదడుకి పని బాగా కల్పిస్తోంది. లల్లూరాం అండ్ కంపెనీలో "ఉమ" ఉంది. ఆ తర్వాత ఆ పిల్ల వెళ్ళిన వెనుక రామం లల్లూరాం అండ్ కంపెనీలో జొరబడి "ఇందాకటి అమ్మాయి ఏం కొనుక్కుందని" అడిగాడు. "కొనుక్కోడానికి రాలేదు. ఓ నెక్లెస్ తెచ్చింది అమ్మను. నాలుగు వందలుకు సరిచేసుకొని వెళ్ళిపోయింది. డబ్బుకు రేపు వస్తానంది" అని స్నేహితుడైన లల్లూరాం చెప్పాడు. రామంతలమీద ఆకాశం పడ్డట్టయింది! హా! జిల్లాజెడ్జిగారమ్మాయి దొంగా: రామం "ఉమని" వెనుకవేపుగా గమనించాడు.. మొహం చూస్తే తానెక్కడ పట్టుపడిపోతానేమో అని.

అప్రయత్నంగా 'ఉమ' గదితలుపులు తెరువపడ్డవి. ఏమిటో మాట్లాడుకొంటున్న స్నేహితురాళ్ళు అదిరిపడ్డారు. "నాలుగువందలు తెచ్చుకొన్నావా?" అని తీక్షణంగా అడిగాడు రామం, ఉమ తెల్లబోయింది.

ఉషమొహం నల్లబారింది "ఏమిటిరామం: నీప్రవర్తన నాకేం నచ్చడంలేదు. నువు తక్షణం గది విడిచి పో" అన్నది పెద్దగా.

ఇంతలో బిల బిల మంటూ అందరూ వచ్చారు. "ఏమిటి?" అంటూ హనుమంతమ్మాయిగారు సంగతి విని ఎటూ పాలుపోక చతికిలపడ్డది కుర్చీలో. ఉమ మాత్రం రామం చెప్పిన కథ విన్న తర్వాత లల్లూరాం అండ్ కంపెనీకి పోయినమాట వాస్తవం. అది నేను కాదు. మా అక్క రమాదేవి. దానికి మొన్న నాన్నారు ఓ నెక్లెస్ కొని ఇచ్చారు. అది బాగాలేదని నాలుగు వందలుకు అమ్మివేసి పైన ఓ రెండు వందలు వేసి. ఇంకా చక్కటి నెక్లెస్ కొనుక్కొంటానని అన్నది. మాఅమ్మతో. నేవిన్నాను. అంతే!" అన్నది.

ఎక్కడివాళ్ళక్కడ కూర్చుండిపోయారు. ఉమ వెళ్ళిపోయింతర్వాత రామం అందరికీ నమస్కరించి" గుడ్‌బై: నీగదేకాదు మీ ఇల్లే విడచిపెట్టి పోతున్నాను. మంచిది!" అంటూ వెళ్ళిపోయాడు, ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"తప్పక రామం పప్పులో కాలేశాడమ్మా!" అన్నది ఉష మెల్లగా.

"రమాదేవి మీతో మేటనీకొచ్చిందా?" అని ప్రశ్నించింది రాధ.

"ఇదొక అసిస్టెంట్. నాన్‌సెన్స్! ఆమె బి. ఎ. మేము ఇంటరువాళ్ళం, మాతో ఎందుకొస్తుంది! ఎందుకూ వెలగపెడుతున్నావు యస్. యస్. యల్.సి. అని విసుక్కొంది ఉష.

ఇంతలో రామం పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ రావడం చూసి ముఖ్యంగా అతగాడి చేతిలో నెక్లెస్ చూసి అందరూ పరిగెత్తారు. కానీ రామం బాగా నవ్వుతూ కుర్చీలోకూర్చుని "అది సరే ఉషా! ఆనాడు మేటనీకి వెళ్ళేముందు నెక్లెస్‌ని మెడకు తగిలించుకున్నావా? లేదా?" అన్నాడు.

సుగుణ బెణుక్కుండా కూర్చున్నదల్లా లేచి ఆవులించి "హా(" ఆ మేకునే తగిలించి పోయివుంటుంది. అంతేనా! అన్నది.

"నేనప్పుడే ఆమాట అందామనుకొన్నానంది" కమల తాపీగా.

రవి క్రీకంట చూస్తో "రమాదేవి దొంగేనా?" అన్నాడు. వ్యంగ్యంగా.

"ఎక్కడుంది!" అని ఆత్రంగా అడిగారు నాయనమ్మా, అత్తాయ్.

"ఆరోజు ఆ పచ్చరిక్షాలోనేనా ఎక్కావు:

"అవును, ఏం?"

"అందులోనే ఉంది. కోపంగా వెళ్ళినా, అలా రిక్షా కట్టించుకొని అలా అలా తిరిగొద్దామని పోయేను. రిక్షాలో వుంది"

"ఆ(" అన్నారు అందరూ! డిటెక్టివ్ రామం నవ్వాడు గర్వంగా!

